సాక్షి
అనంతపురం

ఆదివారం । 23 । మార్చి । 2025

వైభవంగా శ్రీవారి చక్రస్నానం



కదిరి: ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారి చక్రస్నానం(తీర్థవాది) శనివారం వైభవంగా జరిగింది. ముందు శ్రీదేవి, భూదేవి సమేత నారసింహుడికి స్నపన తిరుమంజనం నిర్వహించారు.ఆ తర్వాత శ్రీవారి సుదర్శన చక్రాన్ని భృగుతీర్థంలో స్నానం చేయించారు. అనంతరం భక్తులు పెద్ద సంఖ్యలో భృగు తీర్థం(కోనేరు)లో పుణ్యస్నానాలు ఆచరించారు. కాగా, స్వామివారికి ఆదివారం పుష్పయాగోత్సవం నిర్వహించి బ్రహ్మోత్సవాలకు ముగింపు పలకనున్నారు.



న్యూస్‌రీల్

ఫారంపాండ్లతో భూగర్భజలాల పెంపు



ఫారంపాండ్ తవ్వకానికి భూమి పూజ చేస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

కూడేరు: వ్యవసాయ పొలాల్లో ఫారంపాండ్లు తవ్వించుకుంటే వర్షపు నీరు అందులోకి చేరి భూగర్భ జలాలు పెంపొందుతాయని కలెక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. 'ప్రపంచ జల దినోత్సవం'లో భాగంగా శనివారం కూడేరు మండలం జయపురం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద తవ్వనున్న ఫారంపాండ్ల పనులను ఆయన ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐదు ఎకరాల్లోపు భూమి ఉన్న రైతులు ఫారం పాండ్‌ను తవ్వించుకోవాలని సూచించారు. ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టుకోవాలన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో సాగుతూ విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. మండలానికి ఇచ్చిన టార్గెట్ పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ సలీం బాషా, సర్పంచ్ రమాదేవి, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి, రైతులు పాల్గొన్నారు.

వైద్యం చేస్తే.. వైకుంఠానికే..



ఆర్ఎంపీ వైద్యం.. గాల్లో ప్రాణం

- సరిహద్దు ప్రాంతాల్లో విచ్చలవిడిగా వెలసిన ఆర్ఎంపీ, పీఎంపీ క్లినిక్‌లు
- పరిధికి మించి వైద్యం చేస్తూ ఉసురు తీస్తున్న 'శంకర్‌దాదాలు'
- చంద్రబాబు ప్రభుత్వంలో ఘోరంగా సర్కారు వైద్య సేవలు
- గతిలేక క్లినిక్‌లను ఆశ్రయిస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్న పేదలు

- 'కర్ణాటక సరిహద్దున ఉన్న రాయదుర్గం ఏరియా ఆస్పత్రి పరిస్థితిపై ఇప్పటికే రెండు సార్లు మంత్రిని కలిశా. ప్రిన్సిపల్ సెక్రటరీకి మెమొరాండం ఇచ్చా. అన్నీ ఇస్తున్నా.. కనీస స్పందన రావడం లేదు. ఒక్కరంటే ఒక్క డాక్టర్‌ను కూడా ఈ తొమ్మిది నెలల కాలంలో నియమించలేదు. ఎక్కడ్నుంచైనా ట్రాన్స్‌ఫర్ కూడా చేయలేదు. మేము ప్రతి చిన్నదానికీ బళ్లారి ఆస్పత్రిపైనే ఆధార పడాల్సి వస్తోంది. రోగులు పక్క రాష్ట్రానికి పోతుంటే మాకెంతో అవమానకరంగా ఉంది అధ్యక్షా..'

... ఇవీ రెండు రోజుల క్రితం ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అసెంబ్లీలో మాట్లాడిన మాటలు. ప్రభుత్వ వైద్యం ఏస్థాయిలో పడకేసిందో కాలవ మాటలు తేటతెల్లం చేస్తున్నాయి. ఫలితంగా ప్రైవేటు వైద్యులు, మరీ ముఖ్యంగా కర్ణాటక సరిహద్దు ప్రాంతాల్లో ఆర్ఎంపీలు, పీఎంపీలు చెలరేగిపోతున్నారు. రోగుల పరిస్థితిని ఆసరాగా తీసుకుని సొమ్ము చేసుకోవడమే కాకుండా..తెలిసీ తెలియని వైద్యం చేస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

రాయదుర్గం: పదో తరగతి కూడా పూర్తి చేసి ఉండరు. కొన్ని రోజులు ఏదో ఒక ఆస్పత్రిలో డాక్టరు దగ్గర ఇంజెక్షన్లు, మందులు అందజేసే సహాయకుడిగా పని చేసి ఉంటారు. బయటకొచ్చాక తామేదో ఎంబీబీఎస్, ఎంఎస్ చదివినట్లు భావించి క్లినిక్‌లు ప్రారంభించేస్తున్నారు. బెడ్లు ఏర్పాట్లు చేసుకుని సెలైన్లు ఎక్కించేస్తున్నారు. యూట్యూబ్‌లలో వీడియోలు చూసి చికిత్సలు చేస్తూ ప్రాణాలు కూడా బలికోరుతున్నారు. జిల్లాలోని సరిహద్దు ప్రాంతాల్లో ఇష్టారాజ్యంగా క్లినిక్‌లు ఏర్పాటు చేసుకున్న కొందరు ఆర్ఎంపీలు, పీఎంపీలు పేదల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. స్టెరాయిడ్లు, గర్భస్రావ, నిద్ర మాత్రలు కూడా రాస్తున్న ఈ 'శంకర్‌దాదాలు' అమాయకుల ఉసురు తీసేస్తున్నారు. గత 3 నెలల వ్యవధిలోనే జిల్లాలోని సరిహద్దు నియోజకవర్గమైన రాయదుర్గం ప్రాంతంలో మూడు ప్రాణాలు బలిగొన్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక్కడే కాదు.. ప్రతి నెలా జిల్లాలో ఎక్కడో ఒక చోట ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి. అయినా, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఏ మాత్రమూ పట్టించుకోవడం లేదు. ఘటన జరిగినప్పుడు హడావుడి చేసి .. తర్వాత 'మామూలు'గా వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

గతి లేక ఆశ్రయిస్తే..

చంద్రబాబు ప్రభుత్వం ఏర్పాటయ్యాక సర్కారు వైద్య సేవలు ఘోరంగా తయారయ్యాయి. మెరుగైన వైద్యం పేదలకు అందని ద్రాక్షలా మారింది. అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రాథమిక వైద్య శాలల్లో సేవలు సరిగా అందడం లేదు. రాయదుర్గంలో పేరుకే వంద పడకల ఆస్పత్రి అయినా సగానికి పైగా వైద్యుల సీట్లు ఖాళీగా ఉన్నాయి. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లోనూ ఇదే దుస్థితి. దీనిపై అధికార పార్టీ ఎమ్మెల్యేలే నిలదీస్తున్నా సర్కారులో చలనం లేని పరిస్థితి నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో పేదల సంక్షేమమే లక్ష్యంగా వైద్య రంగానికి పెద్దపీట వేయగా, 'కూటమి' కొలువుదీరాక పరిస్థితి ఒక్కసారిగా తలకిందులైంది. దీంతో దిక్కులేని పరిస్థితుల్లో పేదలు ఆర్ఎంపీల క్లినిక్‌లను ఆశ్రయిస్తూ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు.

ఈ నెల 2న



రాయదుర్గం పట్టణానికి చెందిన టీడీపీ కౌన్సిలర్ భర్త, పీఎంపీ చన్నవీర క్లినిక్‌లో వైద్య చికిత్సలు అందుకున్న తాపీమేస్త్రీ విజయ్ ప్రాణాలు వదిలాడు. తన కుమారుడి మృతికి పీఎంపీ వైద్యమే కారణమని విజయ్ తల్లి లక్ష్మీదేవి ఆరోపించింది. చన్నవీర టీడీపీ నాయకుడు కావడంతో కేసు నమోదుకు అధికారులు, పోలీసులు వెనుకంజ వేశారు. బాధిత కుటుంబీకులతో దుప్పటి పంచాయితీ నిర్వహించి, యువకుడి ప్రాణానికి రూ.3 లక్షలు వెలకట్టారు.

ఈ నెల 21న



గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన వన్నూర్ స్వామి, లక్ష్మీ దంపతుల కుమార్తె అనుశ్రీకి తీవ్ర జ్వరం సోకింది. రాయదుర్గం పట్టణంలోని మూస క్లినిక్‌లో ఆర్ఎంపీ హఫీజ్‌తో వైద్యం చేయించారు. చిన్నారికి టైఫాయిడ్ ఉన్నట్టు నిర్ధారించిన హఫీజ్.. క్లినిక్‌లో ఆమెకు సెలైన్ ఎక్కించారు. ఈ క్రమంలోనే చిన్నారి మృతి చెందింది. ఆర్ఎంపీ వైద్యం వికటించడం వల్లే బిడ్డ మృతి చెందిందని తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు.

రెండు నెలల క్రితం..

తలనొప్పితో బాధపడుతున్న బ్రహ్మసముద్రం మండలం రాయలప్పదొడ్డికి చెందిన వివాహిత జ్యోతిబాయి... గుమ్మఘట్ట మండలం భూపసముద్రం గ్రామానికి వచ్చి ఆర్ఎంపీతో ఇంజెక్షన్ వేయించుకుంది. కాసేపటికే తలనొప్పి మరింత తీవ్రం కావడంతో కుటుంబీకులు ఆమెను కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఆస్పత్రి, అక్కడి నుంచి అనంతపురం సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయింది. ఆర్ఎంపీ ఇచ్చిన ఇంజెక్షన్ వికటించడం వల్లే జ్యోతిబాయి మృతి చెందిందని కుటుంబీకులు, బంధువులు ఆరోపించారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

ఆర్ఎంపీలు, పీఎంపీలు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు చేపడతాం. క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తాం. రాయదుర్గంలో వరుస మరణాలపై విచారణకు ఆదేశించాం. బాధ్యులు ఎంతటి వారైనా చర్యలు తప్పవు.

– ఈబీ దేవి, డీఎంహెచ్ఓ

మూసా ఆర్ఎంపీ క్లినిక్ సీజ్



క్లినిక్‌ను సీజ్ చేస్తున్న దృశ్యం

రాయదుర్గంటౌన్: పట్టణంలోని బళ్లారి రోడ్డులో ఉన్న మూసా ఆర్ఎంపీ క్లినిక్‌ను వైద్యశాఖ అధికారులు సీజ్ చేశారు. ఆర్ఎంపీ నిర్వాకంతో గుమ్మఘట్ట మండలం గలగల గ్రామానికి చెందిన నాలుగేళ్ల చిన్నారి అనుశ్రీ మృతి చెందిన విషయం తెలిసిందే. ఘటనపై స్పందించిన డీఎంహెచ్ఓ ఈబీ దేవి శనివారం రాయదుర్గం చేరుకుని విచారణ చేపట్టారు. క్లినిక్‌ను సీజ్ చేశారు. అనంతరం స్థానిక ఏరియా ఆస్పత్రిలో బాధిత తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీఎం, విద్యార్థి సంఘాల నేతలు డీఎంహెచ్ఓను కలిసి ఆర్ఎంపీపై చర్యలు చేపట్టడంతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. కాగా, 'మూసా' మెడికల్ షాపును జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న తనిఖీ చేశారు.

కౌలు రైతులకూ డ్రిప్ పరికరాలు ఇవ్వండి

- వ్యవసాయ శాఖ అధికారులకు జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ

అనంతపురం సిటీ: కౌలు రైతులకూ డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు సరఫరా చేసి ఆదుకోవాలని, ఏ ఒక్క రైతుకూ అన్యాయం చేయొద్దని జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి జిల్లా పరిషత్ స్థాయీ సంఘం-1, 2, 3, 4, 5, 6, 7(ఆర్థిక, ప్రణాళిక/గ్రామీణాభివృద్ధి/వ్యవసాయం/విద్య, వైద్య/పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ శాఖలు/ఐసీడీఎస్/ సాంఘిక సంక్షేమ శాఖలు) సమావేశాలు అనంతపురంలోని జిల్లా పరిషత్ కార్యాలయ ప్రధాన సమావేశ మందిరంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా బుక్కరాయసముద్రం, గోరంట్ల, కణేకల్లు,నార్పల జెడ్పీటీసీ సభ్యులు భాస్కర్,జయరాం, పద్మావతి, వేదాంతం నాగరత్నమ్మ మాట్లాడుతూ జిల్లాలో తాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ.. వేసవికి ముందే ఎక్కడెక్కడ తాగునీటి ఎద్దడి తలెత్తే అవకాశం ఉందో గుర్తించి, అందుకు తగ్గట్టు ప్రణాళికలు రూపొందించడంలో ఎందుకు వైఫల్యం చెందారంటూ రెండు జిల్లాల ఎస్ఈలను నిలదీశారు. తాగునీటి పథకాల నిర్వహణకు కోట్లాది రూపాయలు జెడ్పీ నుంచి నిధులు ఇస్తున్నా వాటర్ సీనరైజ్ చార్జెస్‌ను మున్సిపాలిటీల నుంచి వసూలు చేసుకొని వాడుకోవడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీసత్యసాయి తాగునీటి పథకంలో ఫిల్టర్ బెడ్స్ మార్చాలని ఆదేశించారు. దళితవాడలు, గిరిజన తండాల్లో రహదారులు, తాగునీటి సమస్యలను తక్షణం పరిష్కరించాలని కంబదూరు జెడ్పీటీసీ సభ్యుడు గుద్దెళ్ల నాగరాజు కోరారు. పాఠశాలలను తరచూ తనిఖీలు చేస్తే ఉపాధ్యాయుల్లో బాధ్యత పెరుగుతుందని నార్పల జెడ్పీటీసీ నాగరత్నమ్మ అన్నారు. పదో తరగతిలో మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని గిరిజమ్మ సూచించారు. గత ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన రైతు భరోసా కేంద్రాల భవనాలను కొన్ని మండలాల్లో పోలీస్ స్టేషన్లకు కేటాయించడంపై అనంతపురం రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శనగల కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఉదారంగా వ్యవహరించాలని కోరారు.

ఐసీడీఎస్‌ను బ్రోకర్లు శాసిస్తారా?

శ్రీసత్యసాయి జిల్లాలో ఐసీడీఎస్ జిల్లా కార్యాలయాన్ని ఓ బ్రోకర్ శాసిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని గోరంట్ల జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాం నాయక్ తెలిపారు. సమగ్ర విచారణ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతపురం జిల్లాలోనూ కొందరు సీడీపీఓలు అవినీతి అక్రమాలకు పాల్పడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను గాలికొదిలేశారని జెడ్పీ వైస్ చైర్‌పర్సన్ వేదాంతం నాగరత్నమ్మ ఆరోపించారు. ఈ అంశంపై ఐసీడీఎస్ శ్రీసత్యసాయి జిల్లా పీడీ భారతి స్పందిస్తూ.. తాను కొత్తగా వచ్చానని, పరిశీలించి చర్యలు తీసుకుంటానని చెప్పారు. అనంతపురం అర్బన్‌లోని బుద్ధప్పనగర్ అంగన్‌వాడీ కేంద్రం కార్యకర్త భాగ్యమ్మ పదేళ్లుగా విధులకు డుమ్మా కొట్టి, ప్రైవేటు కాలేజీలో అధ్యాపకురాలిగా పని చేస్తున్నట్లు గత సమావేశాల్లో అధికారుల దృష్టికి తెచ్చామని, ఆమెపై ఎటువంటి చర్యలు తీసుకున్నారని రూరల్ జెడ్పీటీసీ సభ్యుడు చంద్రకుమార్ ఐసీడీఎస్ పీడీ నాగమణిని ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న అధికారులపైనా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. పీడీ నాగమణి స్పందిస్తూ.. ఈ రోజే తొలగింపు ఉత్తర్వులు భాగ్యమ్మకు అందించామని సమాధానమిచ్చారు. కార్యక్రమంలో సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలపై 'పచ్చ' నాయకుడి పైశాచికం

- తల్లి, కుమార్తె మృతదేహాలు ఖననం చేయకుండా అడ్డగింత
- అధికారులు, పోలీసులూ వత్తాసు పలకడంపై సర్వత్రా విమర్శలు



మృతదేహాలను శ్మశానానికి తీసుకెళ్లకుండా అడ్డగించడంతో రోడ్డుపైనే ఉంచి పోలీసులు, తహసీల్దార్‌తో వాగ్వాదం చేస్తున్న బాధిత కుటుంబసభ్యులు

తాడిపత్రి: ఎస్సీ వర్గానికి చెందిన తల్లి, కుమార్తె మృతదేహాలను శ్మశానంలో ఖననం చేయకుండా అడ్డుకుని టీడీపీ నాయకుడు పైశాచికం ప్రదర్శించాడు. పైగా అధికారులు, పోలీసులు కూడా అతనికే వత్తాసు పలకడం తీవ్ర విమర్శలకు దారి తీసింది. వివరాలు.. తాడిపత్రి మండలంలోని ఇగుడూరు గ్రామానికి చెందిన తల్లీకుమార్తెలు పుల్లమ్మ, సువార్తమ్మలు అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందారు. ఈ క్రమంలో శనివారం మృతదేహాలను ఖననం చేసేందుకు శ్మశానవాటికకు తీసుకెళ్తుండగా, అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నరిసిరెడ్డి అడ్డుకున్నాడు. రెవెన్యూ, పోలీసు అధికారులను సైతం పిలిపించి, ఖననానికి శ్మశానంలో స్థలం లేదని చెప్పించారు. ఈ క్రమంలో అధికారులు, పోలీసులతో మృతుల కుటుంబ సభ్యులు, స్థానిక ఎస్సీలు గొడవకు దిగారు. తల్లి, కుమార్తె మృతదేహాలను ఖననం చేశారు. కాగా, ఇగుడూరు గ్రామంలో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు 55 ఉన్నాయి. వీరి కోసం శ్మశాన స్థలాన్ని కేటాయించాలని స్థానిక అధికారులను కలెక్టర్ ఆదేశించినా ఇప్పటివరకూ ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. దీంతో సమస్యలు తలెత్తుతున్నాయని ఎస్సీలు వాపోయారు. ఈ విషయంపై తాడిపత్రి తహసీల్దార్ రజాక్‌వలి మాట్లాడుతూ గతంలో ఎస్సీలకు కేటాయించిన శ్మశానవాటిక స్థలాన్ని రద్దు చేసినట్లు తెలిపారు. ప్రత్యామ్నాయంగా మరో చోట స్థలం కేటాయించాలని జిల్లా కలెక్టర్ ఇది వరకే ఆదేశించారన్నారు. కానీ గ్రామంలో ఎక్కడా ప్రభుత్వ స్థలాలు లేవని చెప్పారు. ప్రయివేట్ స్థలం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వానికి నివేదిక పంపామని, అనుమతులు లభించగానే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ చెప్పారు.

విజయవాడకు కలెక్టర్

అనంతపురం అర్బన్: కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం విజయవాడకు బయలుదేరి వెళ్లారు. ఆదివారం అక్కడ సివిల్ సర్వీసెస్ అధికారులకు జరగనున్న క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొంటారు. అటు తరువాత ఈనెల 25, 26 తేదీల్లో విజయవాడలో కలెక్టర్లతో ముఖ్యమంత్రి నిర్వహించనున్న కాన్ఫరెన్స్‌కు హాజరవుతారు. 27న తిరిగి విధులకు హాజరవుతారని కార్యాలయ అధికార వర్గాలు వెల్లడించాయి.

చిలమకూరులో వడగండ్ల వాన

యల్లనూరు: మండలంలోని చిలమకూరు గ్రామంలో శనివారం వడగండ్ల వాన కురిసింది. సాయంత్రం దాదాపు 20 నిమిషాల పాటు వడగండ్లు పడ్డాయి. అకాల వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో టమాట, మొక్కజొన్న, తదితర పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

పారా గేమ్స్‌లో సత్తా



సాకే బాబు

అనంతపురం: భారత ప్రభుత్వం న్యూఢిల్లీలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో జిల్లాకు చెందిన సాకే బాబు సత్తా చాటాడు. మెన్స్ ఎఫ్-56 విభాగం షాట్‌పుట్‌లో అత్యుత్తమ ప్రతిభతో రెండో స్థానంలో నిలిచి రజత పతకం దక్కించుకున్నాడు. ఈ సందర్భంగా సాకే బాబును అథ్లెటిక్స్ కోచ్ ఎస్ఎం మంజుల, పారా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్. నాగరాజు, ఎన్. శ్రీనివాసులు అభినందించారు.

క్లుప్తంగా

మత్స్య సంపద పెంచాలి



పీఏబీఆర్‌లోకి చేపపిల్లలు వదులుతున్న కలెక్టర్

కూడేరు: మత్స్య సంపద పెంపునకు కృషి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మండల పరిధిలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్)లోకి శనివారం ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన కింద 2024–25 సంవత్సరానికి గాను ఐదు లక్షల చేప పిల్లలను కలెక్టర్ వదిలారు. మత్స్యకారులను ఆర్థికంగా బలోపేతం చేయాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. మత్స్యకారులు మాట్లాడుతూ డ్యాంలో నీరు పుష్కలంగా ఉందని, అదనంగా మరో 10 లక్షల చేప పిల్లలు సరఫరా చేయాలని, కొర్రకోడులో కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు. సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిప్పే నాయక్, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఫిషరీస్ డీడీ శ్రీనివాసనాయక్, ఎఫ్డీఎఫ్‌లు ఆసిఫ్, బాబునాయక్, ఎంపీడీఓ కుళ్లాయి స్వామి పాల్గొన్నారు.

గ్యాస్ లీకై వృద్ధురాలి మృతి

అనంతపురం: వంట చేస్తున్న సమయంలో గ్యాస్ లీకై మంటలు వ్యాపించి వృద్ధురాలు మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని రెవెన్యూ కాలనీ (షిర్డీ కాలనీ)లో నివాసం ఉంటున్న విశ్రాంత ఏఎస్ఎం మంగళ లక్ష్మీదేవి (75), ఎం.రంగన్న దంపతులు. 2004లో భర్త చనిపోయాడు. సంతానం లేకపోవడంతో లక్ష్మీదేవి ఒంటరిగా ఉంటోంది. శనివారం ఇంట్లో వంట చేస్తుండగా.. గ్యాస్ లీకై మంటలు చెలరేగాయి. ఆ మంటల నుంచి బయటకు రాలేక లక్ష్మీదేవి తీవ్రంగా గాయపడి మృతి చెందింది. సోదరుడు కనుముక్కల ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ సీఐ శాంతిలాల్ తెలిపారు.

కబ్జాకాండ



- తాడిపత్రికి చెందిన చద్మళ్ల సత్యనారాయణరెడ్డికి అనంతపురంలోని లెక్చరర్స్ కాలనీలో 66 సెంట్ల భూమి ఉంది. ఈ ప్రైవేట్‌ల్యాండ్ ప్రహరీని కొందరు ధ్వంసం చేసి దౌర్జన్యంగా గుడిసెలు వేసి భూ కబ్జాలకు పాల్పడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు శింగనమల మండలం తరిమెల గ్రామానికి చెందిన గట్టు రామాంజినేయులు, అనంతపురంలోని ముత్యాలమ్మ కాలనీకి చెందిన రామాంజినమ్మ , తాడిమర్రి మండలం పెద్దకోట్ల గ్రామానికి చెందిన రాములమ్మను భూ ఆక్రమణ (ల్యాండ్ గ్రాబింగ్) కేసులో పోలీసులు అరెస్ట్ చేశారు.
- అనంతపురం కమలానగర్‌లో నివసిస్తున్న డాక్టర్ కాటం వీరభద్రయ్య, డాక్టర్ బాలకుమారి దంపతులు 12.67 సెంట్లు (సర్వే నంబర్–94), 38 సెంట్ల భూమి (సర్వేనంబర్ 89/4బీ)ని 2007, 2009 సంవత్సరాల్లో కొనుగోలు చేశారు. కొంతమంది వ్యక్తులు ప్రజా సంఘం పేరుతో భూమిలోకి ప్రవేశించి గుడిసెలు వేయించారు. భూమి తమదేనని డాక్టర్లు డాక్యుమెంట్లు చూపించడానికి ప్రయత్నిస్తే దౌర్జన్యానికి పాల్పడేలా వ్యవహరించారు. దీంతో డాక్టర్లు కేసు పెట్టడంతో భూ కబ్జాకు పాల్పడిన ఐదుగురిని రిమాండ్‌కు తరలించారు.

వామ్మో.. భూ చోళ్లు..!

- ఖాళీ జాగా కనిపిస్తే కబ్జా
- అనంతపురం పరిధిలో మితిమీరుతున్న ఆగడాలు
- ఇప్పటికే 13 మందిపై ల్యాండ్ గ్రాబింగ్ కేసు
- కూటమి అధికారంలోకి వచ్చాక పెరిగిన భూ ఆక్రమణలు
- ప్రహరీ కట్టినా.. కూల్చేసి గుడిసెలు వేసుకుంటున్న వైనం

అనంతపురం: జిల్లా కేంద్రం అనంతపురంలో పలువురు కష్టపడి సంపాదించి కొన్న భూములు, స్థలాలను అక్రమార్కులు గద్దల్లా తన్నుకుపోతున్నారు. స్థలం భద్రత కోసం వేసిన ప్రహరీలు సైతం దౌర్జన్యంగా కూల్చేస్తున్నారు. ఈ స్థలం మాదని యజమానులు చెబితే వారిపై దాడికి దిగడం, దౌర్జన్యం చేయడం, ఎదురు కేసులు పెట్టే కుట్రకు తెరతీస్తున్నారు. కష్టపడి సంపాదించిన స్థలాలను గద్దల్లా తన్నుకుపోతుంటే ఎలా బతకాలి అంటూ బాధితులు ఆవేదన చెందుతున్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఖాళీ జాగా కనిపిస్తే చాలు 'భూ'చోళ్లు పాగా వేసేస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.కోట్ల విలువైన స్థలాలపై కబ్జాకాండ కొనసాగిస్తున్నారు.

పావులు పేదవారే

అనంతపురంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులతో కుమ్మక్కై కొంతమంది చోటా లీడర్లు ఎవరి భూమిలో పాగా వేయాలో నిర్ణయించుకుంటున్నారు. కబ్జా చేసినా ధైర్యంగా అడగలేని వారి స్థలాలపై కన్నేస్తున్నారు. ఇందులో గుడిసెలు వేయడానికి పేదవారిని పావుగా వాడుకుంటున్నారు. ప్రైవేట్ భూమి అని తెలిసినా.. గుడిసెలు వేసుకుంటే తమకు ఎదురులేదని చెబుతారు. పేదలు నమ్మి చోటా లీడర్లకు డబ్బులు ముట్టజెబుతున్నారు. ఏదో ఒక న్యాయపరమైన చిక్కును తెరపైకి తెచ్చి స్థల యజమానిని ఇబ్బందిపెట్టేలా గుడిసెలు వేసుకుంటున్నారు. ఒక్కో గుడిసెకు రూ.30 వేల నుంచి రూ.50 వేలు వసూలు చేస్తున్నారు. కొంత మంది చోటా నాయకులు ఇదే వ్యవహారాల్లో నిమగ్నం కావడం పరిపాటిగా మారింది. ఆఖరుకు పేదలు డబ్బులు పోగొట్టుకుని కేసుల్లో ఇరుక్కుంటున్నారు.

ప్రభుత్వ స్థలంలో గుడిసెలు



కొలిమిపాళ్యం సర్కారు చింత తోపులో వెలసిన గుడిసెలు

కుందుర్పి: కొలిమిపాళ్యం సమీపంలోని సర్కారు చింతతోపు సర్వేనంబర్ 70–1, 70–2లో గల స్థలంలో టీడీపీ నాయకులు గుడిసెలు వేయించారు. ఎంపీపీ కమలమ్మ, సర్పంచ్ గంగాధర తదితరులు అడ్డగించే ప్రయత్నం చేయగా 'మా ప్రభుత్వం.. మా ఇష్టం' అంటూ 12 మంది టీడీపీకి చెందిన వారు స్థలాలు ఆక్రమించారు. మొదట గుడిసెలు వేసి తమ వశం చేసుకోవాలని కుయుక్తులు పన్నుతున్నారని ఎంపీపీ, సర్పంచ్ తెలిపారు. ఈ విషయమై తహసీల్దార్ శ్రీనివాసులు మాట్లాడుతూ గుడిసెలు వేసిన ప్రభుత్వ స్థలాన్ని శనివారం పరిశీలించామని, గ్రామంలో ఇరు వర్గాలవారు గుడిసెలు వేశారని, వారితో మాట్లాడామని చెప్పారు. స్వచ్ఛందంగా తీసేయకపోతే, తాము సోమవారం తొలగిస్తామని స్పష్టం చేశారు.



లెక్చరర్స్ కాలనీలో ఆక్రమించిన భూమిలో వేసిన గుడిసెలు

కబ్జా చేస్తే సహించేది లేదు

ప్రైవేట్ భూమిని కబ్జా చేస్తే సహించేది లేదు. ఇటీవల ఐదు ల్యాండ్ గ్రాబింగ్ కేసులు నమోదు చేసి, నిందితులను రిమాండ్‌కు పంపాం. ఎంతటి వారినైనా వదిలిపెట్టేది లేదు. అవసరమైతే పీడీ యాక్ట్ నమోదు చేసేందుకు వెనుకాడం.

– పి.జగదీష్, ఎస్పీ

అంగన్‌వాడీ స్థలం ఆక్రమణ



అంగన్‌వాడీ కేంద్రం భవనానికి కేటాయించిన స్థలంలో నిర్మిస్తున్న ఇల్లు

రాప్తాడురూరల్: కూటమి ప్రభుత్వంలో 'తమ్ముళ్ల' ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ భూములను కబ్జా చేసేస్తున్నారు. అధికారులు నోటీసులిస్తున్నా లెక్కచేయడం లేదు. అనంతపురం రూరల్ మండలం చిన్నంపల్లి పంచాయతీ సంతోష్‌నగర్‌లో అంగన్‌వాడీ కేంద్రం కోసం కేటాయించిన స్థలాన్ని ఓ టీడీపీ చోటా నాయకుడు దురాక్రమణ చేయడమే ఇందుకు నిదర్శనం. వివరాలు.. సంతోష్‌నగర్ ఆంజనేయస్వామి గుడి వద్ద దాదాపు 6 సెంట్ల స్థలాన్ని ప్రజా ప్రయోజనార్థం వదిలిపెట్టారు. ఈ స్థలంలో అంగన్‌వాడీ భవన నిర్మాణానికి 2020 అక్టోబరు 18న పంచాయతీ తీర్మానం చేసింది. ఇక్కడ ప్రైవేట్ భూమి సెంటు రూ.9 లక్షలు పలుకుతోంది. 'కూటమి' ప్రభుత్వం వచ్చాక చిన్నంపల్లికి చెందిన ఓ టీడీపీ నాయకుడు ఈ స్థలంపై కన్నేశాడు. రెండు సెంట్ల స్థలంలో నిర్మాణ పనులు ప్రారంభించాడు. సమాచారం అందుకున్న పంచాయతీ కార్యదర్శి వెళ్లి నోటీసులు ఇవ్వగా.. ఏమాత్రం లెక్క చేయలేదు. ఎంపీడీఓ, కలెక్టర్‌తో మాట్లాడుకుంటానంటూ కార్యదర్శితో వాదించాడు. ఇటీవల కొందరు కాలనీవాసులు కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కలిసి ఫిర్యాదు చేయగా.. కలెక్టర్ ఆదేశాలతో ప్రస్తుత పంచాయతీ కార్యదర్శి వెళ్లి నోటీసులు ఇచ్చాడు. అయితే తనకు తహసీల్దార్ మంజూరు చేశారంటూ నకిలీ పట్టా చూపించడం గమనార్హం. దీనిపై ఎంపీడీఓ దివాకర్‌ను వివరణ కోరగా... 'సంతోష్‌నగర్‌లో ఓపెన్ స్థలంలో ఓ వ్యక్తి ఇల్లు నిర్మిస్తున్నాడు. పంచాయతీ కార్యదర్శి నోటీసు ఇచ్చారు. అక్కడ అంగన్‌వాడీ కేంద్రం భవనం నిర్మాణానికి పంచాయతీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం కూడా చేశారు. అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తాం' అని స్పష్టం చేశారు.

నూతన విద్యా విధానానికి అనుగుణంగా సిలబస్



బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ల సమావేశంలో మాట్లాడుతున్న వీసీ సుదర్శనరావు

అనంతపురం: నూతన జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా బీటెక్ కోర్సు సిలబస్ రూపకల్పన చేసినట్లు జేఎన్‌టీయూ(ఏ) వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు అన్నారు. బీటెక్ మూడు, నాలుగు సంవత్సరాలకు సంబంధించిన పాఠ్యాంశాలను రూపకల్పన చేయడానికి శనివారం యూనివర్సిటీలో బోర్డ్ ఆఫ్ స్టడీస్ సమావేశం నిర్వహించారు. అంతకుముందు వీసీ అధ్యక్షతన బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ల సమావేశం నిర్వహించారు. ప్రతి విభాగంలోనూ మైనర్, హానర్ డిగ్రీ ప్రోగ్రాంను ప్రతిపాదించారు. విద్యార్థి 18 క్రెడిట్లు అదనంగా చదివితే ఇంజినీరింగ్ డిగ్రీతో పాటు మైనర్, హానర్స్ డిగ్రీ ఇస్తారు. క్వాంటం కంప్యూటింగ్‌లో మైనర్ డిగ్రీ చేయడానికి అనుమతి ఉంటుంది. 40 శాతం క్రెడిట్స్ ఆన్‌లైన్‌లో చదువుకోవచ్చు. దీనితో పాటు కచ్చితంగా ఐదు రోజుల వర్క్‌షాపు, ప్రతి సెమిస్టర్‌లోనూ ఎక్స్‌పర్ట్ లెక్చర్, క్రెడిట్ డిపాజిట్ కోసం ఆమోదం తెలిపారు. ప్రతి విద్యార్థి ఫైనలియర్ రెండో సెమిస్టర్‌లో ఇంటర్న్‌షిప్, మూడో సెమిస్టర్ సమ్మర్ బ్రేక్‌లో ఇంటర్న్‌షిప్ చేయాల్సి ఉంటుంది. ఈ సిలబస్‌ను 2025–26 విద్యా సంవత్సరానికి మూడో సంవత్సరం చదువబోయే విద్యార్థులకు అమలు చేస్తారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఓఎస్డీ టూ వీసీ ప్రొఫెసర్ దేవన్న, ప్రొఫెసర్ పీఆర్ భానుమూర్తి, డీఏపీ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్లు, సభ్యులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయమే లాభదాయకం



ఆకట్టుకుంటున్న మిల్లెట్ ముగ్గు



మాట్లాడుతున్న విశ్రాంత ఐఏఎస్ అధికారి బి.జనార్దన్‌రెడ్డి

- చిరుధాన్యాలు సాగు చేసేలా ప్రోత్సహించాలి
- తద్వారా ప్రజారోగ్యం మెరుగుపడుతుంది
- 'మిల్లెట్ మేళా'లో వక్తలు

అనంతపురం అగ్రికల్చర్: వాతావరణ మార్పులకు అనుగుణంగా ప్రకృతి సిద్ధంగా సహజ వ్యవసాయ పద్ధతులు అవలంబించేలా రైతులను ప్రోత్సహిస్తే వ్యవసాయం లాభసాటిగా మారడమే కాకుండా ప్రజారోగ్యం కూడా మెరుగుపడుతుందని వక్తలు తెలిపారు. శనివారం స్థానిక పోలీసు కాంప్లెక్స్‌లో ప్రభుత్వ సంస్థలు, ఎన్‌జీఓలతో ఏర్పాటైన 'అనంత సుస్థిర వ్యవసాయ వేదిక' ఆధ్వర్యంలో మూడు రోజుల 'మిల్లెట్ మేళా' ప్రారంభమైంది. విశ్రాంత ఐఏఎస్, జిల్లా మాజీ కలెక్టర్ బి.జనార్ధన్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్, ఎన్ఐఆర్‌డీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ డబ్ల్యూఆర్ రెడ్డి, విశ్రాంత ఐపీఎస్, జమ్మూ కశ్మీర్ మాజీ డీజీపీ గోపాల్‌రెడ్డి, ఏఎఫ్ ఎకాలజీ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వైవీ మల్లారెడ్డి, ప్రకృతి వ్యవసాయ నిపుణులు సుభాష్ పాలేకర్ శిష్యులు విజయరామ్ తదితరులు ఈ సందర్భంగా మాట్లాడారు. వాతావరణంలో వచ్చిన మార్పులను దృష్టిలో పెట్టుకుని స్థానిక వంగడాలను ప్రోత్సహించాలన్నారు. రైతులు పండించిన పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకుంటేనే సన్న, చిన్నకారు రైతులు ఆర్థికంగా గట్టెక్కుతారని తెలిపారు. 'మన వ్యవసాయం, మన పంటలు, మన వంటలు, మన ఆరోగ్యం' అనే నాలుగు అంశాలు ఒకదానితో మరొకటి ముడిపడిన వాస్తవాన్ని గుర్తుంచుకోవాలన్నారు. పాతతరం పంటలైన సజ్జలు, జొన్నలు, రాగులు, కొర్రలు, సామలు, అరికెలు, ఊదలు, అండుకొర్రలు లాంటి చిరుధాన్యాలను, అనుములు, కందులు, అలసంద, పెసలు, నూగులు లాంటి పప్పుధాన్యపు పంటలు పెద్ద ఎత్తున సాగులోకి వచ్చేలా రైతులకు చేయూతనివ్వాల్సిన అవసరం ఉందన్నారు. రాయలసీమ జిల్లాల్లో 80 శాతం వ్యవసాయం వర్షాలపై ఆధారపడి ఉన్నందున ఈ పంటల సాగుకు అనువుగా ఉంటుందన్నారు. ఈ పంటల ద్వారా ఆరోగ్యకరమైన ఆహారం లభిస్తుందని, పశువులు, జీవాలకు మేతగానూ ఉపయోగపడతాయన్నారు. నేల ఆరోగ్యంతో పాటు జీవ వైవిధ్యం, గ్రామీణ జీవనోపాధులు మెరుగుపడతాయన్నారు. కాగా, మిల్లెట్ మేళా సందర్భంగా పోలీసు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్టాల్స్, చిరుధాన్యాలతో వేసిన స్వాగతం పలికే ముగ్గు ఆకట్టుకుంది. మేళాలో తొలిరోజు ప్రధానంగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు, వాటి లాభాల గురించి విజయరామ్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, జేడీఏ ఉమామహేశ్వరమ్మ, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి, ఉద్యానశాఖ డీడీ నరసింహారావు, ఏపీడీ ఫిరోజ్‌ఖాన్, నాబార్డు అధికారి మోహనయ్య, కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ మాధవీలత, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్రికెట్ బెట్టింగ్‌పై ఉక్కుపాదం : ఎస్పీ

అనంతపురం: క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడినా, ప్రోత్సహించినా చట్టపరమైన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ పి.జగదీష్ హెచ్చరించారు. ఐపీఎల్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో జిల్లాలో ఎక్కడా క్రికెట్ బెట్టింగ్‌కు తావు లేకుండా ప్రజలు సహకరించాలని శనివారం ఓ ప్రకటనలో కోరారు. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక బృందాలతో నిఘా పెట్టామని, క్రికెట్ బెట్టింగ్‌తో సంబంధాలు ఉన్న పాత నేరస్తులను బైండోవర్ చేస్తున్నామని తెలిపారు. ఎక్కడైనా బెట్టింగ్ జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే డయల్ 100/112 లేదా సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు తెలియజేయాలని సూచించారు.

నగదుతో లారీ డ్రైవర్ పరార్

కంబదూరు: వ్యాపారికి చెందిన నగదుతో లారీ డ్రైవర్ పరారైన ఘటన శనివారం కంబదూరులో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన సుధాకర్ అనే వ్యాపారి వద్ద విజయవాడకు చెందిన దుర్గాప్రసాద్ అనే వ్యక్తి కొన్నేళ్లుగా లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం వేరుశనగ కాయలను లోడ్ చేయడానికి పావగడ రహదారిలో ఉన్న గోడౌన్ వద్దకు వెళ్లి.. లారీని రివర్స్ పెట్టాలని సుధాకర్ డ్రైవర్‌కు చెప్పాడు. ఆ సమయంలో తన వద్ద ఉన్న రూ.5.80 లక్షల డబ్బును లారీ క్యాబిన్‌లో ఉంచాడు. దీన్ని గమనించిన డ్రైవర్ లారీని రివర్స్‌లో ఉంచి.. న్యూట్రల్‌లో పెట్టి.. ఆ తర్వాత వేరే వ్యక్తికి ఫోన్ చేసి ద్విచక్రవాహనం తెప్పించుకొని వ్యాపారి డబ్బుతో ఉడాయించాడు. బాధిత వ్యాపారస్తుడు కంబదూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పాలిటెక్నిక్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం



అప్పటి గురువును సత్కరిస్తున్న పూర్వ విద్యార్థులు

అనంతపురం: నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం 1959–2024కు సంబంధించిన పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. దాదాపు వెయ్యిమంది పూర్వ విద్యార్థులు హాజరై అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు. ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. వివిధ రంగాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకరికొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. పూర్వ విద్యార్థుల సమ్మేళనం అధ్యక్షుడు వివేకానందరెడ్డి, జనరల్ సెక్రెటరీ రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్ పెద్దయ్య చౌదరి, ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి, సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ సి.కేశవచంద్రరావు, డాక్టర్ ఎం.రామకృష్ణారెడ్డి ప్రసంగించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరచిన విద్యార్థులకు పూర్వ విద్యార్థి అపెక్స్ కన్స్‌స్ట్రక్షన్ అధినేత బి.తిరుపాల్ నగదు బహుమతి అందజేశారు. సాయి ఆదిత్య కన్‌స్ట్రక్షన్ అధినేత పురుషోత్తమ మురళీకృష్ణ, నిత్య సురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్‌పర్సన్ నిర్మలా మురళి అప్పటి గురువులను ఘనంగా సత్కరించారు.

నకిలీ నోట్ల కలకలం!

బ్రహ్మసముద్రం : మండలంలో నకిలీ నోట్ల వ్యవహారం కలకలం రేపింది. పిల్లలపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులు కర్ణాటకకు చెందిన ఓ వ్యాపారితో అప్పు చేశారు. డబ్బు తిరిగివ్వాలని ఒత్తిడి చేయడంతో ఇద్దరు వ్యక్తులు గురువారం ఆ వ్యాపారిని పిలిపించారు. ముగ్గురూ కలిసి మద్యం తాగారు. ఆ సమయంలో రూ.50వేలు డబ్బు అందజేశారు. మద్యం మత్తులో ఉన్న వ్యాపారి వాటిని ఇంటికి తీసుకెళ్లాడు. శుక్రవారం నోట్లను పరిశీలించగా నిజమైనవి కావని తేలింది. తనకు ఒరిజినల్ నోట్లు ఇవ్వాలని వ్యాపారి ఫోన్ చేసి చెప్పి.. పిల్లలపల్లికి శుక్రవారం సాయంత్రం చేరుకున్నాడు. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని అక్షరాలు ఉండాల్సిన చోట చిల్డ్రన్స్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అని ఉన్న నోట్లను వ్యాపారి వెనక్కు ఇచ్చి ఇంటి ముఖం పట్టాడు. వ్యాపారికి అప్పు చెల్లించకుండా ముప్పుతిప్పలు పెట్టాలనే ఉద్దేశంతో సదరు వ్యక్తులు పోలీసులకు ఫోన్ చేసి కర్ణాటకకు చెందిన వ్యక్తి నకిలీ నోట్లు మార్పిడి చేస్తున్నట్లు సమాచారం అందించారు. పోలీసులు హుటాహుటిన వచ్చి వ్యాపారిని అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. శనివారం పిల్లలపల్లికి చెందిన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. ముగ్గురినీ కళ్యాణదుర్గం రూరల్ సీఐ వద్ద హాజరుపరిచి.. విచారణ చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

మల్చింగ్ షీట్ తిని మూడు పశువుల మృతి

కుందుర్పి: జంబుగుంపలలో టమాట పంటకు పరిచే మల్చింగ్ షీట్ (ప్లాస్టిక్ కవర్) తిని మూడు పశువులు మృతి చెందాయి. బాధిత రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. జంబుగుంపల గ్రామానికి చెందిన ఓబులేసు రెండు పశువులు, హనుమంతరాయుడు ఒక పాడి ఆవును శనివారం కుందుర్పి మార్గంలో మేతకు తీసుకెళ్లారు. అక్కడ ఓ పొలంలో టమాట పంటతో కలిసి ఉన్న ప్లాస్టిక్ కవర్లను పశువులు తిన్నాయి. గంటల వ్యవధిలోనే ఊపిరాడక మూడు పశువులు అక్కడికక్కడే ప్రాణాలు విడిచినట్లు బాధితులు తెలిపారు. పశువుల విలువ రూ.1.30 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు.

తాడిపత్రిలో పటిష్ట బందోబస్తు



తాడిపత్రిలో పోలీస్ బందోబస్తు

తాడిపత్రిటౌన్: వైఎస్సార్‌సీపీ నేత, మున్సిపల్ కౌన్సిలర్ ఫయాజ్‌బాషా ఇంటిపై టీడీపీ నాయకులు రాళ్ల దాడి చేసిన నేపథ్యంలో పోలీసులు శుక్రవారం తాడిపత్రిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఇరు పార్టీల నాయకుల ఇళ్ల వద్ద, ప్రధాన కూడళ్లలో ఏఎస్పీ రోహిత్‌కుమార్ చౌదరి ఆధ్వర్యంలో 250 మంది పోలీసులను మోహరించారు. అదే రోజు అర్ధరాత్రి డీఐజీ షిమోషి సంఘటన స్థలాలను పరిశీలించారు. ఎస్పీ జగదీష్ తాడిపత్రిలోనే ఉంటూ బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

భార్యతో గొడవపడి భర్త బలవన్మరణం

గార్లదిన్నె: భార్యతో గొడవపడి మనస్తాపం చెందిన కల్లూరుకు చెందిన అబ్దుల్ షఫీ (47) బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా శనివారం మీడియాకు వివరాలు వెల్లడించారు. మద్యానికి బానిసైన అబ్దుల్ షఫీ రోజూ భార్యతో గొడవపడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం కూడా గొడవ జరిగింది. భర్త తీరుతో విసిగిపోయిన భార్య గుంతకల్లులోని పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన అబ్దుల్ షఫీ అదే రోజు రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

నెట్టికంటుడికి రూ.లక్ష విరాళం



ఆలయ సిబ్బందికి చెక్కు అందజేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: అనంతపురం నగరానికి చెందిన డి.అశోక్ కుమార్ అనే భక్తుడు శనివారం కుటుంబ సభ్యులతో కలిసి కసాపురం నెట్టింకటి ఆంజనేయస్వామివారికి రూ.లక్ష విరాళాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా అర్చకులు దాతల పేరున ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

వేసవిలో అప్రమత్తత అవసరం

అనంతపురం మెడికల్: వేసవిలో అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం డీఎంహెచ్ఓ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. కార్మికులు, రైతులు, వ్యవసాయ పనులు చేసే కూలీలు, భవన నిర్మాణ కార్మికులు, ఇటుకల బట్టీ వద్ద పని చేసే కార్మికులు ఎండ తీవ్రత నుంచి రక్షణ పొందాలని సూచించారు. ఉదయం 10 గంటల్లోపు సాయంత్రం 4 గంటల తర్వాత పనులు చూసుకోవాలన్నారు. తెలుపు రంగు, కాటన్ వస్త్రాలు, తలకు టోపీ, ఉప్పు కలిపిన మజ్జిగ, గ్లూకోజు నీటిని తీసుకోవాలన్నారు.

పాఠశాలకు ఫర్నీచర్ వితరణ



కుర్చీలు, కంప్యూటర్స్ అందజేస్తున్న కెనరా బ్యాంక్ డీజీఎం టీఆర్ బాలాజీరావు, ఏజీఎం లారెన్స్ తదితరులు

అనంతపురం అగ్రికల్చర్: కార్పొరేట్ సామాజిక సేవా కార్యక్రమం (సీఎస్ఆర్)లో భాగంగా కెనరా బ్యాంక్ ఆధ్వర్యంలో స్థానిక రాజేంద్రనగర్ మున్సిపల్ హైస్కూల్‌కు అవసరమైన ఫర్నీచర్ అందజేశారు. శనివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.3 లక్షలు విలువ చేసే కుర్చీలు, సీసీ కెమెరాలు, కంప్యూటర్లు, ల్యాబ్ పరికరాలు పంపిణీ చేశారు. సమాజ సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూనే ఖాతాదారులకు, అన్ని వర్గాలకు ఆధునిక బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నట్లు తిరువనంతపురం సర్కిల్ ఆఫీస్ డీజీఎం టీఆర్ బాలాజీరావు, అనంతపురం ఆర్ఓ హెడ్, ఏజీఎం లారెన్స్, మెయిన్ బ్రాంచ్ చీఫ్ మేనేజర్ శ్రీనాథ్‌నాయక్ తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్య, మౌలిక వసతులు, భద్రత, డిజిటల్ విద్య, ప్రయోగాత్మక అధ్యయనానికి అవసరమైన సామగ్రి అందించామని పేర్కొన్నారు.

గోదాముల వద్ద పటిష్ట బందోబస్తు



ఈవీఎంల తనిఖీ అనంతరం రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ

అనంతపురం అర్బన్: ఈవీఎంలు భద్రపరిచిన గోదాముల వద్ద నిరంతర నిఘా, పటిష్ట బందోబస్తు ఉండాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం పాత ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని గోదాములను సందర్శించి వాటిలో భద్రపరిచిన ఈవీఎంలను జాయింట్ కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గోదాముల వద్ద సీసీ కెమెరాల నిఘా, పోలీసు బందోబస్తు నిరంతరాయంగా కొనసాగాలన్నారు. అనుమతి లేని వ్యక్తులు గోదాముల పరిసరాల్లోకి రాకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో అనంతపురం అర్బన్ తహసీల్దార్ హరికుమార్, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, డీటీ కనకరాజు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్రం, రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక పాలన



నినాదాలు చేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్/రాప్తాడురూరల్: కేంద్రం, రాష్ట్రంలో కార్మిక వ్యతిరేక పాలన సాగుతోందని సీపీఐ, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం అనంతపురం నగర శివారులోని శ్రీకృష్ణగార్డెన్స్‌లో ఉమ్మడి అనంతపురం జిల్లా ఏఐటీయూసీ కార్యశాలను సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి ప్రారంభించారు. ఏఐటీయూసీ పతకాన్ని నాయకులు ఆవిష్కరించారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు రాజేష్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డి.జగదీష్, ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి వెంకటసుబ్బయ్య, రాష్ట్ర కార్య నిర్వాహణ కార్యదర్శి రామారావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగ సుబ్బారెడ్డి, సీపీఐ ఉమ్మడి జిల్లా కార్యదర్శులు జాఫర్, వేమయ్య యాదవ్ మాట్లాడారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజా, కార్మిక సమస్యలను విస్మరిస్తున్నాయని మండిపడ్డారు. పవన్ కళ్యాణ్ సనాతన ధర్మం అంటూ తిరుగుతున్నారని.. లోకేష్ రెడ్‌బుక్ పేరుతో కక్షసాధింపులకు శ్రీకారం చుట్టారని తీవ్రస్థాయిలో విమర్శించారు. కార్యక్రమంలో సీపీఐ, ఏఐటీయూసీ, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అత్యవసరమైతే అంతే..

'రెండు రోజుల క్రితం ఆత్మకూరుకు చెందిన ఓ మహిళకు పురిటి నొప్పులు రావడంతో ఓ ప్రైవేటు వాహనంలో కళ్యాణదుర్గం ఆర్డీటీ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు గర్భవతిని పరీక్షించారు. 'గర్భిణి ఆరోగ్య పరిస్థితి బాగా లేదు. మీరు వెంటనే అనంతపురం వెళ్లండి అని సూచించారు'. దీంతో వారు వెంటనే 108కు ఫోన్ చేశారు. 108 వాహనంలో కళ్యాణదుర్గం నుంచి అనంతపురం బయలుదేరారు. మార్గంమధ్యలో ఆత్మకూరు మండలం టోల్‌గేట్ వద్దకు రాగానే 108 వాహనం టైరు పగిలిపోయింది. మరోటైరు (స్టెఫినీ) కూడా లేదని 108 సిబ్బంది తెలిపారు. అప్పటికే రాత్రి 9 గంటలు కావడంతో గర్భిణి పరిస్థితి ఆందోళనగా ఉండటంతో వారు పక్కనే ఉన్న హైవే అంబులెన్స్ సిబ్బందిని సంప్రదించారు. రాత్రి సమయంలో గర్భిణి పరిస్థితి చూసి హైవే అంబులెన్స్‌లో తీసుకెళ్లారు. ఆస్పత్రికి చేరుకునే వరకూ ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.



ఇటీవల ఆత్మకూరులో 108 వాహనం లేకపోవడంతో గర్భిణిని హైవే అంబులెన్స్‌లో ఆసుపత్రికి తీసుకెళ్తున్న దృశ్యం (ఫైల్)

- ఆత్మకూరులో 108 సేవలకు సుస్తీ
- 20 రోజుల క్రితం మరమ్మతులకు గురైన వాహనం
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ప్రమాదాలు జరిగితే పక్క మండలాల నుంచి రావాల్సిందే..!
- పట్టించుకోని అధికారులు

ఆత్మకూరు: పేదల సంజీవని (108)కి పెద్ద తిప్పలొచ్చాయి. మరమ్మతుల సమస్యలతో 108 వాహనాల నిర్వహణను గాలికి వదిలేశారు. వాహనాలు రోడ్డు ఎక్కక పోవడంతో అత్యవసర సేవలకు అంతరాయం ఏర్పడింది. మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్సార్ హయాంలో ఎక్కడ ప్రమాదం జరిగినా కుయ్.. కుయ్ అంటూ 108 వాహనాలు ప్రమాదం జరిగిన పది నిమిషాల్లో ఘటనా స్థలానికి చేరుకునేవి. అదే తరహాలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో జగనన్న వైద్య సేవలకు ప్రాధాన్యత ఇచ్చారు. నాణ్యమైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో 108 వాహనాల పరిస్థితి మరీ దారుణంగా తయారైంది. ప్రమాదం జరిగిందని ఫోన్ చేసినా స్పందించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ఫోన్ చేసిన గంటకు కూడా 108 వాహనం రాని పరిస్థితి ఏర్పడింది. దీంతో ప్రమాదంలో గాయపడిన వారిని ప్రైవేటు వాహనాల్లో తీసుకెళ్లాల్సిన దుస్థితి నెలకొంది.

ఇబ్బందులు పడుతున్న క్షతగాత్రులు

ఆత్మకూరుకు చెందిన 108 వాహనం గత 20 రోజులుగా మండల ప్రజలకు అందుబాటులో లేదని చెప్పవచ్చు. 108 వాహనం మరమ్మతులకు గురి కావడంతో రిపేరీ చేయించేందుకు తీసుకెళ్లారు. అత్యవసర సేవల కోసం మండల ప్రజలు ఫోన్ చేస్తే.. వాహనం అందుబాటులో లేదని చెబుతున్నారు. దీందో అనారోగ్యానికి గురైన వారు, రోడ్డు ప్రమాదాలకు గురైన బాధితులు అవస్థలు పడుతున్నారు. ఆత్మకూరు సమీపంలో ఏదైనా ప్రమాదం జరిగితే కూడేరు నుంచి లేదా.. రాప్తాడు, అనంతపురం నుంచి 108 వాహనం రావాల్సి వస్తోంది. ఆయా ప్రాంతాల నుంచి 108 వాహనం వచ్చే సరికి ఆలస్యం అవుతోంది. ఫలితంగా ప్రమాదాలకు గురైన వారు ప్రాణాలను అరచేతిలో పెట్టుకోవాల్సి వస్తోంది. అంతేకాకుండా ఆత్మకూరులో 108 వాహనం అందుబాటులో లేకపోవడంతో ఇక్కడ పని చేస్తున్న 108 సిబ్బంది రాప్తాడు, గార్లదిన్నె, కూడేరుకు వెళ్లి విధులు నిర్వహిస్తున్నారు. ఏదిఏమైనా ప్రజలను కాపాడే అత్యవసర వాహనాలు ప్రజలకు అందుబాటులో లేకపోవడం ఇబ్బందిగా మారింది. ప్రమాదం జరిగినప్పుడు 108 వాహనం రాకపోతే ప్రాణాలు కోల్పోయే అవకాశం లేకపోలేదు. ప్రజలను దృష్టిలో ఉంచుకుని ఆత్మకూరు మండలానికి వెంటనే 108 వాహనం అందుబాటులో ఉంచాలని స్థానికులు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్లాం..

మండల కేంద్రంలో ఉన్న 108 వాహనం మరమ్మతులకు గురైంది. వాహనాన్ని రిపేరీకి పంపించాం. ఈ విషయాన్ని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. మరో వారం, పది రోజుల్లో 108 వాహనం అందుబాటులోకి వస్తుంది. అత్యవసర సేవలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకుంటాం.

– సబిహా సుల్తానా, పీహెచ్‌సీ వైద్యాధికారి, ఆత్మకూరు

తాగునీటి ఎద్దడి తలెత్తనీయొద్దు



మాట్లాడుతున్న అధికారులు

రాప్తాడురూరల్: ఎండాకాలం ప్రారంభం కావడంతో అనంతపురం రూరల్ మండలంలోని గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేశారు. శనివారం అనంతపురం రూరల్ ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ వరలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానంగా తాగునీటి సమస్యపై చర్చ జరిగింది. ఆకుతోటపల్లి, అనంతపురం రూరల్, చియ్యేడు, కృష్ణంరెడ్డి పల్లి, ఇటుకలపల్లి ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటి నీటి ఎద్దడి తలెత్తుతోందని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు వాపోయారు. ఇప్పటికే తాగునీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ దివాకర్ హామీ ఇచ్చారు.

అర్జీల పరిశీలన.. అక్కడికక్కడే పరిష్కారం



రవాణాశాఖ కార్యాలయం గేటు వద్ద అర్జీలను పరిశీలిస్తున్న డీటీసీ వీర్రాజు

అనంతపురం సెంట్రల్: రవాణాశాఖలో సమస్యల పరిష్కారానికి ఉప రవాణా కమిషనర్ (డీటీసీ) వీర్రాజు విన్నూత కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ రవాణాశాఖ కార్యాలయం గేటు వద్దే తిష్ట వేసి వాహనదారుల సమస్యలపై ఇచ్చే ప్రతి అర్జీని పరిశీలించారు. కొన్నింటికి అక్కడికక్కడే పరిష్కారం చూపారు. కొన్ని సమస్యలను పలానా గడువులోపు పరిష్కరిస్తామని చెప్పారు. అలాగే సమస్య పరిష్కారం అయిన తర్వాత సదరు వాహనదారుడికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చేలా సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ప్రజలు రవాణా శాఖ కార్యాలయం చుట్టూ తిరగకూడదనే ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు డీటీసీ వీర్రాజు వెల్లడించారు.

లైంగిక నేరాలకు పాల్పడితే చర్యలు

రాప్తాడు/ఆత్మకూరు: బాలికలపై లైంగిక నేరాలకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, పోక్సో కోర్టు జిల్లా జడ్జి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. గొందిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో శనివారం మహిళలకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు.

ఆత్మకూరు: ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని ఫ్యామిలీ కోర్టు జిల్లా జడ్జి హరిత తెలిపారు. శనివారం వై.కొత్తపల్లి గ్రామంలో మహిళలకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. 18 సంవత్సరాల్లోపు పిల్లలకు బాల్య వివాహాలు చేయరాదని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు.

సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత



శానిటేషన్ పనులను పరిశీలిస్తున్న మేయర్ వసీం

అనంతపురం కల్చరల్: రంజాన్ పర్వదినాన్ని ఎటువంటి ఇబ్బంది లేకుండా జరుపుకునేందుకు ఈద్గాల వద్ద పారిశుధ్య పనులు త్వరగా పూర్తి చేయాలని నగర మేయర్ అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని ఈద్గా మైదానాల వద్ద జరుగుతున్న శానిటేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేగవంతంగా పనిచేసి ప్రత్యేక ప్రార్థనలకు అన్ని వసతులు కల్పించాలన్నారు. అలాగే సామూహిక ప్రార్థనల్లో పాల్గొనే వారు కూడా ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వెంటనే స్పందించి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. స్థానిక డ్రైవర్స్ కాలనీ సమాధుల ప్రహరీ నిర్మాణానికి రూ.60 లక్షలు, లైట్ల ఏర్పాటుకు రూ.15 లక్షలు, హెచ్చెల్సీ కెనాల్ సమీపంలోని ఈద్గాకు రూ.48 లక్షల వ్యవయంతో కాంపౌండ్ వాల్ మంజూరు అయిందని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. ఇక్కడ కూడా లైట్ల ఏర్పాటు జరుగుతుందన్నారు. గత నెల రోజులుగా రంజాన్ కోసం ఈద్గాల వద్ద అభివృద్ధి పనులను సమీక్షిస్తున్న ముతవల్లి షకీల్ షఫీని అభినందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రహంతుల్లా, అబూ సాలెహ, లాలు, కో–ఆప్షన్ సభ్యుడు షంషుద్దీన్, ఎంహెచ్ఓ విష్ణుమూర్తి, వక్ఫ్‌బోర్డు మాజీ అధ్యక్షుడు కాగజ్‌ఘర్ రిజ్వాన్, వైఎస్సార్‌సీపీ నాయకులు దాదా ఖలందర్, దాదు, కుళ్లాయి స్వామి, రియాజ్, శీన, ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.



అగ్ని ప్రమాదంలో లారీ దగ్ధం

గార్లదిన్నె: కల్లూరులో 44వ నంబర్ జాతీయ రహదారిపై శనివారం అర్ధరాత్రి ప్రమాదవశాత్తూ ఓ లారీ దగ్ధమైంది. ఎస్ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన వివరాలు.. హైదరాబాద్ నుంచి బెంగళూరుకు సర్ఫెక్సెల్ సబ్బు పొడి లోడ్‌తో లారీ బయలుదేరింది. కల్లూరు తరిమెల క్రాస్ పెన్నానది బ్రిడ్జి సమీపంలోకి రాగానే.. లారీ ఇంజన్‌లో అకస్మాత్తుగా మంటలు వచ్చాయి. ఈ ఘటనలో లారీతో పాటు సర్ఫెక్సెల్ సబ్బు పొడి కాలిపోయాయి. డ్రైవర్ సోహేల్‌కు గాయాలయ్యాయి. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108లో పామిడికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా.. ఈ ప్రమాదంలో రూ.20 లక్షల నష్టం వాటిల్లినట్లు సమాచారం.

జాతీయస్థాయి ఆర్చరీ పోటీలకు ఎంపిక



అనంతపురం: అండర్–10 కేటగిరీ జాతీయస్థాయి ఆర్చరీ పోటీలు ఈనెల 23, 24 తేదీల్లో గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో జరగనున్నాయి. ఎంకే స్పోర్ట్స్ అకాడమీలో శిక్షణ పొందుతున్న సాద్విన్, ప్రజ్ఞ, తేజ, తరుణిక, జస్మిత, మాన్విత, మాన్య తదితరులు పోటీలకు ఎంపికయ్యారు. కోచ్ రాహుల్‌బాబు ఆధ్వర్యంలో వీరు శిక్షణ పొందుతున్నారు.

దోమకాటు నివారణ చర్యలు చేపట్టాలి

అనంతపురం కార్పొరేషన్: జిల్లాలో ఫీవర్ సర్వే చేపట్టి, దోమకాటు నివారణ చర్యలు చేపట్టాలని మలేరియా సబ్ యూనిట్ అధికారులకు జిల్లా మలేరియా అధికారి ఓబులు ఆదేశించారు. శనివారం మలేరియా సబ్ యూనిట్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇది వరకే జిల్లాలో నమోదైన 52 ఫైలేరియా కేసులకు మార్బిడిటీ మేనేజ్‌మెంట్ కింద ప్రభుత్వం సరఫరా చేసిన కిట్లను మలేరియా సబ్ యూనిట్ అధికారులకు అందజేశారు. సమావేశంలో ఎంపీహెచ్ఈఓలు కే గిరిధర్ రెడ్డి, కోదండ రామిరెడ్డి, మద్దయ్య, మునాఫ్, రామకృష్ణ, నాగేంద్ర ప్రసాద్, రమేష్ పాల్గొన్నారు.

హేమలతకు డాక్టరేట్

అనంతపురం: ఎస్కేయూలోని సోషియాలజీ విభాగంలో పరిశోధన చేసిన జి.హేమలతకు డాక్టరేట్ ప్రదానం చేశారు. డాక్టర్ చాగంటి రామిరెడ్డి పర్యవేక్షణలో 'అనంతపురం జిల్లాలో వృద్ధ మహిళల జీవన ప్రమాణాలు– సవాళ్లు' అంశంపై పరిశోధన చేశారు. అనంతపురంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాల లెక్చరర్‌గా పనిచేస్తున్న హేమలత ఈ అంశంపై పలు జాతీయ, అంతర్జాతీయ జర్నల్స్ ప్రచురించారు.

మహిళా సాధికారత సాధించడమే లక్ష్యం

అనంతపురం కల్చరల్: మహిళా సాధికరత సాధించడమే లక్ష్యంగా సాగాలని ఫ్యామిలీ కోర్టు జడ్జి హరిత అన్నారు. లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు జరిగాయి. 200 మంది విద్యార్థినులకు న్యాప్ కిన్లు, 35 కుటుంబాలకు నిత్యావసరాలు, లేడీస్‌క్లబ్ అటెండర్ ఓబులేసు పిల్లల చదువుకు రూ.20 వేలు, సమీరాఖాన్‌కు మరో రూ.20 వేల చెక్కు అందించారు. కార్యక్రమంలో డాక్టర్ సుశీల, షమీంషఫీ, సీనియర్ న్యాయవాది శైలజ, వైస్ ప్రెసిడెంట్ ఎం ఆర్ వాణి, సెక్రటరీ డాక్టర్ పద్మా నారాయణరెడ్డి, ట్రెజరర్ అరుణశ్రీ, జాయింట్ సెక్రటరీ నవీన, బాలోత్సవ్ చైర్మన్ షమీమ్ షఫీవుల్లా, నాట్యాచార్యులు మేఘన పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాఘవేంద్ర ఫార్మసీలో యూత్‌పార్లమెంట్

అనంతపురం: దేశ భవిష్యత్తును నిర్దేశించడంలో యువత పాత్ర కీలకమని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ అన్నారు. జేఎన్‌టీయూ సహకారంతో రాఘవేంద్ర ఫార్మసీ కళాశాలలో వికసిత్ భారత్–2047లో భాగంగా యూత్‌పార్లమెంట్ నిర్వహించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ అనంతపురం వీసీ ప్రొఫెసర్ హెచ్.సుదర్శనరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వై.పద్మనాభ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ జే. రవీంద్ర రెడ్డి, మై భారత్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ బిసాటి భరత్ పాల్గొన్నారు.

గ్రీన్ ఆర్మీ సేవలు ప్రశంసనీయం



అనిల్ కుమార్‌ను అభినందిస్తున్న జిల్లా జడ్జి జి.శ్రీనివాస్

అనంతపురం: గ్రీన్ ఆర్మీ సేవలు ప్రశంసనీయమని ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీనివాస్ అన్నారు. అనంతపురం జిల్లా కోర్టు సెంట్రల్ హాల్‌లో శనివారం గ్రీన్ ఆర్మీ అధినేత అనిల్ కుమార్ దంపతులను జిల్లా జడ్జి శాలువాతో సత్కరించారు. పిచ్చుకల సంతతిని పరిరక్షించడంతో పాటు, పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారని కొనియాడారు.

'ఎన్ఎస్‌టీఎస్ఈ' పరీక్షల్లో సత్తా

అనంతపురం ఎడ్యుకేషన్: యూనిఫైడ్ కౌన్సిల్ వారు దేశవ్యాప్తంగా నిర్వహించిన నేషనల్ లెవల్ సైన్స్ ట్యాలెంట్ సర్చ్ ఎగ్జామినేషన్ (ఎన్ఎస్‌టీఎస్ఈ) పరీక్షల్లో స్థానిక సంగమేష్ నగర్‌లోని మాంటిస్సోరి పాఠశాల విద్యార్థులు జాతీయ ర్యాంకులు దక్కించుకున్నారు. 9వ తరగతి విద్యార్థి టీఆర్ సాయి కౌశల్ 23వ ర్యాంకుతో 'నేషనల్ అచీవర్'గా గుర్తింపు తెచ్చుకున్నాడని కరస్పాండెంట్ సూర్యనారాయణరెడ్డి తెలిపారు. విద్యార్థులను కరస్పాండెంట్, పాఠశాలల కార్యదర్శి కె.మాధవి, ప్రిన్సిపాల్ కె.పద్మావతి అభినందించారు.

ఏప్రిల్ 6న బైక్ ర్యాలీ

అనంతపురం కల్చరల్: శ్రీరామ నవమి సందర్భంగా ఏప్రిల్ 6వ తేదీన చేపట్టనున్న బైక్ ర్యాలీ అందరూ పాల్గొనాలని వక్తలు కోరారు. శనివారం పాతూరు అమ్మవారి శాలలో శ్రీరామనవమి మహోత్సవ రథయాత్ర ఆహ్వాన పత్రికలను, బైక్ ర్యాలీ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాతూరు వాసవీ కన్యక పరమేశ్వరీ ఆలయ ప్రతినిధులు తిరువీధుల జగదీష్, ఉత్సవ సమితి కన్వీనర్ దూపకుంట్ల శబరిప్రసాద్, సీనియర్ న్యాయవాది రాఘవేంద్ర, రంగాచారి, గల్లా హర్ష, భవానీ రవికుమార్, రత్నమయ్య, విశ్వేశ్వరరెడ్డి, చిరంజీవిరెడ్డి పాల్గొన్నారు.

కొనసాగుతున్న ఫుట్‌బాల్ పోటీలు

అనంతపురం: అనంత క్రీడాగ్రామంలోని ఆర్డీటీ ఫుట్‌బాల్ స్టేడియం వేదికగా ఏపీ సూపర్‌కప్ మూడో రోజు పోటీలను డీఎస్‌డీఓ ఉదయ్ భాస్కర్ ప్రారంభించారు. కొల్లేరు–వంశధార జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కొల్లేరు జట్టు తరపున ఆడిన బెంగాల్ ఆటగాడు అజయ్ ఏకంగా హ్యాట్రిక్ గోల్స్ సాధించాడు. దీంతో కొల్లేరు జట్టు ఘన విజయం సాధించింది. వంశధార ఒక గోల్ కూడా సాధించలేక చతికిలపడింది. పాయింట్ల పట్టికలో కొల్లేరు జట్టు అగ్రస్థానంలో ఉంది. తుంగభద్ర–నల్లమల జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తుంగభద్ర మూడు గోల్స్, నల్లమల రెండు గోల్స్ సాధించి తుంగభద్ర విజయం సాధించింది. గోదావరి–విశాఖ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో గోదావరి మూడు గోల్స్, విశాఖ ఒక గోల్ సాధించడంతో గోదావరి నెగ్గింది. కోరమాండల్–పెన్నా జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో కోరమాండల్ రెండు గోల్స్, పెన్నా ఒక గోల్ సాధించడంతో కోరమాండల్ గెలుపొందింది.

'నాసా' పోటీల్లో ప్రతిభ

అనంతపురం ఎడ్యుకేషన్: ఇటీవల ప్రకటించిన నేషనల్ ఎరోనాటిక్స్ అండ్ స్పేస్ అడ్మినిస్ట్రేషన్ (నాసా) ఫలితాల్లో ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన శ్రీ చైతన్య విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. స్థానిక కమ్మ భవన్ సమీపంలోని శ్రీ చైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో శనివారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఏజీఎం సుబ్బారెడి అభినందించారు.

కారును ఢీకొన్న సిమెంట్ లారీ

రాప్తాడు: సిమెంట్ లారీ డ్రైవర్ మద్యం సేవించి అతివేగంతో వచ్చి ముందు వెళ్తున్న కారును ఢీకొనడంతో వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డికి పెద్ద ప్రమాదం తప్పింది. వివరాలు.. ఏపీ02 సీహెచ్8342 నంబర్ కారులో యూత్ కన్వీనర్ విశ్వనాథ్ రెడ్డి గొల్లపల్లి నుంచి ధర్మవరం పంగల్ రోడ్డు మీదుగా అనంతపురం వెళ్తున్నాడు. కారు ఆర్డీటీ స్టేడియం దగ్గరకు రాగానే ఎడమ వైపు నుంచి అవతల రోడ్డు పైకి తిరుగుతుండగా.. వెనుకవైపు వస్తున్న కేఏ 35డి 2955 నంబర్ గల సిమెంట్ లారీ (దివాకర్ ట్రావెల్స్) ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు కుడివైపు నుజ్జునుజ్జు అయింది. విశ్వనాథ్ రెడ్డికి కూడా స్వల్పంగా గాయాలు అయ్యాయి. లారీ డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని సీఐ శ్రీహర్షకు విశ్వనాథ్ రెడ్డి వినతిపత్రం ఇచ్చారు.

డేటా నైపుణ్యాలతో ఉద్యోగ అవకాశాలు

అనంతపురం ఎడ్యుకేషన్: కంప్యూటర్ సైన్స్‌లో డేటా నైపుణ్యాలతో ఉద్యోగావకాశాలు మెరుగ్గా ఉంటాయని ఎస్వీ డిగ్రీ కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర రెడ్డి అన్నారు. స్థానిక ఎస్వీ డిగ్రీ, పీజీ కళాశాల కంప్యూటర్ సైన్స్ ఆధ్వర్యంలో శనివారం జాతీయ స్థాయి 'టెక్నికల్ సింపోజియం' నిర్వహించారు.

నగరంలో వర్షం



జోరుగా కురుస్తున్న వర్షం

నగరంలో శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఎండ వేడిమికి అల్లాడిపోయిన ప్రజలకు కాస్త ఉపశమనం లభించింది. నగరంలో వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఆస్వాదించారు. వివిధ ప్రాంతాల్లో కొద్దిసేపు విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో నగరవాసులు ఇబ్బందులు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో చీకట్లోనే వాహనాల రాకపోకలు